సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



సందట్లో సడేమియా!

8లో▸

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లోని ఫర్నిచర్ మాయమవుతోంది. కాగా, తాము సొంత డబ్బులతో కొన్నందునే తీసుకెళ్తున్నామని తాజా మాజీ ఎమ్మెల్యేలు చెబుతున్నారు.



పత్తి రైతు పరేషాన్

ఈ ఏడాది పత్తి విత్తిన నుంచి రెండు నెలల పాటు వానలు కురవగా మొక్కల ఎదుగుదల లోపించి కలుపు పెరిగింది. దీంతో దిగుబడి తగ్గి రైతులు దిగులు చెందుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 27.0/16.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వేకువజామున పొగమంచు కురుస్తుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి హాకీ జట్టు పరిశీలకుడిగా జిల్లా వాసి

ఆదిలాబాద్: ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అండర్–17 బాలుర ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు జాదవ్ రవీందర్ జట్టు పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. ఇచ్చోడ మండలం బోరిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న జాదవ్ రవీందర్ సెలక్షన్ టీం మెంబర్‌గా కూడా వ్యవహరించనున్నారు.

శెనగ పంట పరిశీలన



శెనగ పంటను పరిశీలిస్తున్న పుల్లయ్య

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర, దిమ్మ శివారు ప్రాంతంలో సాగు చేసిన శెనగ పంటను జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శెనగను ఎండు తెగులు, వేరుకుళ్లు తెగులు ఆశించే అవకాశముందని తెలిపారు. వీటి నివారణ చర్యలు రైతులకు వివరించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఆయన వెంట ఏవో ఆష్రఫ్ తదితరులున్నారు.

ఎవరా.. ఇద్దరు?

- అధికారవర్గాల్లో జోరుగా చర్చ

సాక్షి ఎఫెక్ట్..



ఈ నెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనం

కైలాస్‌నగర్: విధి నిర్వహణలో చేతివాటం ప్రదర్శించి బదిలీ కోసం ప్రయత్నిస్తున్న ఆదిలాబాద్ మున్సిపల్ అధికారుల అవినీతి వైఖరిని ఎండగడుతూ ఈ నెల 11వ తేదీన 'ఆ అక్రమార్కుల్లో గుబులు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. అక్రమాలకు పాల్పడుతున్న ఆ ఇద్దరు అధికారులెవరని.. బల్దియా వర్గాలు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు ఆరా తీస్తున్నారు. బల్దియాలో ఇంత జరుగుతున్నా బాధ్యులపై జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. నిజాయతీ గల అధికారులతో విచారణ జరిపిస్తే వారి అక్రమాల చిట్టా పూర్తిగా బయటపడే అవకాశముందని పేర్కొంటున్నారు. ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గ్యాస్ ఏజెన్సీలను సందర్శించిన డీఎస్వో

- ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుకు ఆదేశాలు




ఈకేవైసీ ప్రక్రియ పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: ఉజ్వల ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్‌దారులు ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ 'ఈకేవైసీ.. ఇక్కట్లు' శీర్షికన ఈ నెల 9వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టీ కిరణ్‌కుమార్ స్పందించారు. ఆదిలాబాద్ పట్టణంలోని భారత్ గ్యాస్, నాయక్ గ్యాస్, విమల్ గ్యాస్, రిషి ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. కేంద్రాల వద్ద మహిళలు బారులు తీరి ఉండటం, ఎలాంటి వసతులు లేకపోవడంపై ఆగ్రహించిన ఆయన ఈకేవైసీ నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. డెలివరీ బాయ్స్‌కు ప్రత్యేక పీవోఎస్ పరికరాలు అందజేసి సిలిండర్ అందించేందుకు వెళ్లినపుడే వినియోగదారుల ఈకేవైసీ వివరాలు సేకరించాలని సూచించారు. ఉజ్వల మినహా ఇతర లబ్ధిదారులకు ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు ఎలాంటి తుది గడువు లేదని తెలిపేలా పోస్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అప్పటికప్పుడు పోస్టర్లు ఏర్పాటు చేయించారు. నీడ కల్పించేలా ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేయడంతోపాటు తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎస్వో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రకటించిన రూ.500 గ్యాస్ సిలిండర్‌తో ఈకేవైసీ వివరాల నమోదుకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. దీనిపై వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. ఉజ్వల గ్యాస్ వినియోగదారులు మాత్రమే డిసెంబర్ 31వ తేదీ లోపు ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకునేలా చమురు సంస్థలు ఆదేశాలు జారీ చేశాయని వెల్లడించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాథోడ్ బాబుసింగ్ ఉన్నారు.



ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

శాసనసభ్యుడిగా ఎన్నికైన నేను..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఎన్నికైన నలుగురు గురువారం శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు బీజేపీ నుంచి ఎన్నికైన విషయం తెలిసిందే. ప్రొటెం స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారానికి నిరాకరించి దూరంగా ఉన్నారు. గురువారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలో అసెంబ్లీలో ప్రమాణం చేశారు. ముగ్గురు తెలుగులో, రామారావు పటేల్ హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. - ఆదిలాబాద్/భైంసాటౌన్



ప్లకార్డులతో కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న మెడికోలు

రిమ్స్‌లో ఘర్షణ

- అర్ధరాత్రి వైద్యవిద్యార్థులపై దాడి
- గాయపడ్డ పలువురు మెడికోలు
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- పోలీసుల అదుపులో అసిస్టెంట్ ప్రొఫెసర్, మరో నలుగురు
- అసిస్టెంట్ ప్రొఫెసర్ టర్మినేట్
- ఆరుగురితోపాటు డైరెక్టర్‌పై కేసు



కవిరాజ్‌ను పరామర్శిస్తున్న జోగు రామన్న



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైద్యవిద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్యకళాశాలలో బుధవారం అర్ధరాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. రిమ్స్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న (హౌస్ సర్జన్)లపై అసిస్టెంట్ ప్రొఫెసర్‌తోపాటు బయటి వ్యక్తులు దాడికి దిగారు. కళాశాల వసతిగృహం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దాడి ఘటనలో పలువురు మెడికోలు, దాడికి పాల్పడ్డ బయటి వ్యక్తుల్లో ఒకరికి గాయాలయ్యాయి. దీంతో న్యాయం చేయాలని వైద్యవిద్యార్థులు రిమ్స్ ఆస్పత్రి ఎదుట ప్లకార్డులు పట్టుకుని గురువారం ఆందోళనకు దిగారు. మెడికోలు తరగతులు బహిష్కరించారు. వీరికి జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లు మద్దతు తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్‌చేశారు. ఆ తర్వాత కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి రెండు గంటల పాటు అక్కడ బైఠాయించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ వచ్చి నచ్చజెప్పినా ససేమిరా అన్నారు. దీంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆందోళన వద్దకు చేరుకుని దాడి వివరాలు తెలుసుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వగా మెడికోలు ఆందోళన విరమించారు. వీరికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్, సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లేశ్, దత్తాత్రి తదితరులు మద్దతు తెలిపారు.

దాడి జరిగిందిలా..

బుధవారం సాయంత్రం 6గంటల సమయంలో రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట గల ఆవరణలో డైరెక్టర్‌తో పాటు మరో 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిలబడి మాట్లాడుతున్నారు. ఈ సమయంలో వసతిగృహం వైపు నుంచి ఇంటర్న్‌షిప్ విద్యార్థి కవిరాజ్, మరో ముగ్గురు కారులో అతివేగంగా డైరెక్టర్ చాంబర్ ముందు నుంచి వెళ్లారు. సీసీ ఫుటేజ్ ద్వారా వేగంగా వెళ్లిన కారు కవిరాజ్‌ది గుర్తించిన రిమ్స్ డైరెక్టర్ అతడిని పిలిపించి మందలించారు. ఈక్రమంలో కవిరాజ్‌కు రిమ్స్ డైరెక్టర్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ తర్వాత కవిరాజ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత 7 గంటల ప్రాంతంలో డైరెక్టర్ చాంబర్ వద్దకు వచ్చి క్షమాపణ చెప్పగా వివాదం సమసిపోయింది.

డైరెక్టర్ అభిమానులమని..

వైద్యవిద్యార్థులపై దాడి జరుగుతున్న సమయంలో

ఏడుగురిపై కేసు

వైద్య విద్యార్థులపై దాడికి పాల్పడిన ఆరుగురితోపాటు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. రిమ్స్ డైరెక్టర్‌తోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్, బయటి వ్యక్తులైన వసీమ్, వెంకటేశ్, శ్రీకాంత్, శివకుమార్, మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. శివకుమార్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మిగతా ఐదుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. ఉదయం నుంచి రిమ్స్‌లో మెడికోలు ఆందోళన చేపట్టగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గేటు వద్ద కాపు కాసి..

వైద్యవిద్యార్థి కవిరాజ్‌తో పాటు భరత్, నవీన్, విజయ్ బయట భోజనం చేసి రాత్రి 11 గంటల సమయంలో రిమ్స్ వసతిగృహానికి వచ్చారు. వీరి కోసమే హాస్టల్ గేటు వద్ద వేచి చూసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్, బయటి వ్యక్తులు వసీమ్, వెంకటేశ్, శ్రీకాంత్, శివకుమార్‌తోపాటు మరో వ్యక్తి కవిరాజ్‌పై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న వసతిగృహంలోని మెడికోలు అక్కడికి చేరుకున్నారు. బయటి వ్యక్తులపై ప్రతిదాడికి దిగగా వారు అక్కడినుంచి వాహనంలో పరారయ్యారు. ఈ క్రమంలో ఓ మెడికో విద్యార్థి వాహనానికి అడ్డు వచ్చాడు. దీంతో వారు అతివేగంతో ఢీకొట్టగా కారు బానట్‌పై ఎగిరిపడ్డాడు. మిగతా విద్యార్థులు ఆ వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా గేటును ఢీకొట్టి దాడి చేసినవారు పరారయ్యారు.

ఈ ఘటనకు కారణమేంటని దాడి చేస్తున్నవారిని బాధితులు ప్రశ్నించగా, తాము రిమ్స్ డైరెక్టర్ అభిమానులమని తెలిపారు. అతడిని కించపరిచేలా మాట్లాడినందుకే దాడికి దిగినట్లు పేర్కొన్నారు. కాగా, దాడిలో మెడికోలు కవిరాజ్, భరత్, నవీన్, విజయ్, అభిషేక్‌కు గాయాలయ్యాయి. బయటి వ్యక్తి శివకుమార్ కాలు, చేతికి తీవ్ర గాయాలు కాగా అతడిని ఆస్పత్రిలో చేర్పించారు. దాడిలో గాయపడ్డ మెడికోలు అర్ధరాత్రే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కొంతమంది మెడికోలు రిమ్స్ డైరెక్టర్ ఇంటి వద్దకు వెళ్లి ఆందోళనకు దిగినట్లు సమాచారం.

అసిస్టెంట్ ప్రొఫెసర్ తొలగింపు

రిమ్స్‌లో జరిగిన దాడి ఘటనకు బాధ్యుడైన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రాంతికుమార్‌ను ఉద్యోగం నుంచి టర్మినేట్ చేస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఘటనకు సంబంధించి ఐదుగురు ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రిమ్స్‌లో మరింత సెక్యూరిటీ పెంచుతామని తెలిపారు. ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: రిమ్స్‌లో మెడికోలపై అమానుషంగా దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం అర్ధరాత్రి మానవత్వం లేకుండా హాస్టల్లోకి చొరబడి వైద్య విద్యార్థులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధ్యులైన రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రాంతిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అప్రజాస్వామికంగా దాడి చేసి విద్యార్థులను గాయపరచడం తగదని, బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే దాకా ధర్మసమాజ్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఎంతటి వారున్నా విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు బరుకుంటి రాజీవ్, దర్శనాల అశోక్, కరాటి గంగన్న, గొంటిముక్కల ఓమన్న, బండారి సంతోష్, అగ్గిమల్ల నవీన్, సులగల రమేశ్, బడుగు రాజేశ్వర్ తదితరులున్నారు.

మెడికల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలి

ఎదులాపురం: మెడికల్ విద్యార్థులపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, మెడికల్ విద్యార్థులకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ డిమాండ్ చేశారు. బుధవారం అర్ధరాత్రి రిమ్స్ మెడికల్ కళాశాలలోకి కొందరు దుండగులు చొరబడి మెడికల్ విద్యార్థులపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు క్యాంపస్‌లో సరైన భద్రత ఏర్పాట్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఎవరు పడితే వారు.. ఎప్పుడు పడితే అప్పుడు క్యాంపస్‌లోకి పోయే అవకాశం ఉండటం చూస్తుంటే విద్యార్థుల భద్రతపై అధికారులకు ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని విమర్శించారు. దుండగులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఉట్నూర్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని గంగన్నపేట, దంతన్‌పల్లి, బీర్సాయిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ధాన్యం నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని కోరారు. సమస్యలు తలెత్తితే తమ దృష్టి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట డీటీ త్రియంబక్‌రావు, రైతులున్నారు.

'కేంద్రం నిర్లక్ష్యంతోనే పార్లమెంట్‌పై దాడి'



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్‌జాదవ్

కైలాస్‌నగర్: పార్లమెంట్ భవనంపై దాడి జరగడం ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ నరేశ్‌జాదవ్ ఆరోపించారు. ఎంపీలకే రక్షణ లేకుంటే ఇక దేశ ప్రజలకు మోదీ సర్కారు ఏం భద్రతనిస్తుందని మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కోట్లాది రూపాయలతో కొత్త పార్లమెంట్ భవనం కట్టించామని గొప్పలు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం దాని భద్రతను విస్మరించడం శోచనీయమన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, హోంమంత్రి అమిత్‌షా తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య వైషమ్యాలు, వైరుధ్యాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడం మినహా బీజేపీకి దేశాన్ని పరిపాలించడం చేతకాదని మండిపడ్డారు. హిందుత్వం పేరుతో మత ప్రాతిపదికన విభజించి పాలించడమే మోదీ సర్కార్‌కు తెలిసిన విద్య అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మేకిన్ ఇండియా నినాదంతో దేశాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తోందని ఆరోపించారు. ఒకవైపు విదేశీ డాలర్ విలువ పెరుగుతుంటే మరోవైపు రూపాయి విలువ పడిపోతోందని ఆందోళన వ్యక్తంజేశారు. దేశంలో మేధస్సు కలిగిన యువత సేవలను వినియోగించుకోవడంలో బీజేపీ సర్కార్ విఫలమైందని ఆరోపించారు. తెలంగాణలో హస్తం పార్టీకి అధికారం కట్టబెట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు దిగంబర్‌రావు పాటిల్, దామోదర్‌రెడ్డి, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, శ్రీధర్ తదితరులున్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న జ్ఞానేశ్

ఎదులాపురం: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చట్ట సభల్లో నూతన చట్టాలు రూపొందించాలని యంగ్ జనరేషన్ లీడర్స్ ఆర్గనైజేషన్ నాయకుడు గుడిపెల్లి జ్ఞానేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. గతంలో పార్లమెంట్‌పై తీవ్రవాదుల దాడుల జరిగాయని తెలిపారు. నేడు దేశంలోని నిరుద్యోగ యువత కడుపు మంటతో ప్రభుత్వ తీరును నిరసిస్తూ దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్లపై కూడా ఇలాంటి దాడులు జరిగినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని తెలిపారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చట్టాలు రూపొందించాలని కోరారు. నాయకులు తబ్రేజ్, సంజీవ్, రాకేశ్, దిలీప్ ఉన్నారు.

జీపీఎఫ్ బకాయిలు రూ.13.95 కోట్లు

- విడుదల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఎదురుచూపు
- కొత్త సర్కారులోనైనా సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి



జిల్లా పరిషత్ కార్యాలయం

కైలాస్‌నగర్: భవిష్యత్ అవసరాల కోసం దాచుకునే జీపీఎఫ్ (జనరల్ ప్రావిడెంట్ ఫండ్) డబ్బులు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల చేతికందలేదు. పిల్లల వివాహాలు, ఉన్నత చదువులు, వైద్య ఖర్చులు, ఇళ్ల నిర్మాణం తదితర అవసరాల కోసం దాచుకున్న డబ్బులను పొందేందుకు వారు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. డబ్బులు అవసరమై దరఖాస్తు చేసుకుని ట్రెజరీలో ఆంక్షల ఫలితంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికీ జిల్లాలో రూ.13.95 కోట్ల జీపీఎఫ్ నిధులు పెండింగ్‌లో ఉండటం ఇందుకు నిదర్శనం. తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు అవసరానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

అత్యవసర పరిస్థితిలో అప్పులు చేస్తూ..

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ భవిష్యత్ అవసరాల కోసం జీపీఎఫ్ కింద డబ్బులు దాచుకుంటారు. ప్రతీనెల వారి కనీస వేతనం నుంచి 6శాతం ప్రీమియం కట్ అవుతుంది. ఇలా నెలవారీగా కట్ చేసిన సొమ్మంతా వారి జీపీఎఫ్ అకౌంట్‌లో జమవుతుంది. అందులోంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం లోన్ తీసుకునే వెసులుబాటు ఉంది. లోన్ తీసుకున్న వారు ప్రతీనెల వాయిదాల పద్ధతిలో డబ్బులు చెల్లించాలి. 20 ఏళ్ల సర్వీస్ కలిగిన వారు జీపీఎఫ్ ఖాతాలో జమైన నగదులోంచి 75శాతం వరకు పార్ట్ ఫైనల్‌గా తీసుకునే అవకాశముంది. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. రిటైర్డయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వారి జీపీఎఫ్ ఖాతాల్లో జమైన మొత్తాన్ని ఫైనల్ పేమెంట్‌గా చెల్లిస్తారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ గత సర్కారు హయాంలో పార్ట్‌ఫైనల్, ఫైనల్ పేమెంట్స్ సకాలంలో అందలేదు. ఇందు కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగారు. సకాలంలో జీపీఎఫ్ సొమ్ము చేతికందక అత్యవసరమైన పరిస్థితుల్లో బయట అప్పు తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోందని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలో ఈ ఏడాది ఆగస్టు నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి రూ.13,95,87,000 ఇంకా చెల్లించాల్సి ఉండటం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పటికీ చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ట్రెజరీ, జీపీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

కొత్త సర్కారుపైనే ఆశలు

ఉద్యోగ, ఉపాధ్యాయులు కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. వీరు దాచుకునే జీపీఎఫ్ సొమ్మును గత ప్రభుత్వం మాదిరిగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. తాము దాచుకున్న సొమ్మును తమ అవసరాల కోసం సకాలంలో ఇవ్వకుంటే ఏం లాభమని పేర్కొంటున్నారు. పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయడంతో పాటు ఇకపై పెండింగ్‌లో ఉంచకుండా దరఖాస్తు చేసుకున్న వారికి ఎప్పటికప్పుడు విడుదల చేసి ప్రయోజనం కల్పించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

నూతన నియామకం



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రమోద్

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల జరిగిన తెలంగాణ స్టేట్ ఫార్మసి కౌన్సిల్ ఎన్నికల్లో తెలంగాణ స్టేట్ ఫార్మసి కౌన్సిల్ సభ్యుడిగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన నేరెళ్ల ప్రమోద్‌కుమార్ విజయం సాధించాడు. ఈ సందర్భంగా గురువారం ఆయన యుష్ అండ్ ఫార్మసి కమిషనర్ హరిచందన చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం అందుకున్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య కళోత్సవాలకు వెంకట్



వెంకట్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పద్యకవి, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రపంచ తెలుగు సాహిత్య కళోత్సవాలకు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్లో రెండ్రోజుల పాటు జరిగే ప్రపంచ సాహిత్య కళోత్సవాల్లో ఆయన పాల్గొననున్నారు.

ఇండియన్ మిలిటరీ క్యాంపునకు ఎంపిక



ఎన్‌సీసీ విద్యార్థి అఖిల్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ పానుగంటి అఖిల్ ప్రతిష్టాత్మక ఇండియన్ మిలిటరీ అకాడమీ క్యాంపునకు ఎంపికయ్యాడు. ఈ నెల 17నుంచి 27 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే క్యాంపులో పాల్గొనున్నారు. గురువారం ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ పట్వర్ధన్, అధ్యాపకులు అభినందించారు.

కేవీకే శిక్షణ తరగతుల్లో ఎంపీపీ వీరంగం

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రాంగణంలో చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ గురించి రైతులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో గురువారం బెల్లంపల్లి ఎంపీపీ గోమాస శ్రీనివాస్ వీరంగం సృష్టించారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం...కార్యక్రమంలో భాగంగా శిక్షణలో నైపుణ్యం కనబర్చిన పలువురు రైతులకు జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు తొంగల సత్యనారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు పంపిణీ చేశారు. కొద్దిసేపటి తర్వాత ఎంపీపీ వచ్చి తనను ఎందుకు ఆహ్వానించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జరుగనున్న ముగింపు కార్యక్రమానికి ఆహ్వానించాలని ప్రిపేర్ అయ్యామని కేవీకే శాస్త్రవేత్తలు సమాధానం చెబుతున్నప్పటికీ దుందుడుకు తనం ప్రదర్శించాడు.

సందట్లో సడేమియా!

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిట్టింగులంతా ఓడిపోయారు. దీంతో నియోజకవర్గ కార్యాలయాలను ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదునుగా భావించిన కొంతమంది క్యాంపు కార్యాలయాల్లో ఫర్నిచర్ అపహరించుకుపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని ఫర్నిచర్ మాయమైంది. కొన్ని కార్యాలయాల్లో తాము సొంత డబ్బులతో ఫర్నిచర్ ఏర్పాటు చేశామని, అందుకే తీసుకెళ్లామని తాజా మాజీలు చెబుతున్నారు. ఇదే నిజమైతే రహస్యంగా తరలించడం ఏంటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాక్షి విజిట్

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో ఫర్నిచర్ మాయం
- చాలా కార్యాలయాల్లో కనిపించని వైనం
- ఎత్తుకెళ్లారంటున్న కాంగ్రెస్ నేతలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నాయకులు



చెన్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

మంచిర్యాలలో...
మంచిర్యాలటౌన్: ఎన్నికల ఫలితాలు ప్రకటించిన రోజే నడిపెల్లి దివాకర్‌రావుకు ఓటమి దిశగా ఫలితాలు రావడంతో అతని అనుచరులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని టీవీ, ఫ్రిడ్జ్, రెండు ఏసీలు, 100కు పైగా కుర్చీలు, ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రి తీసుకెళ్లారు. గెలిచిన ఎమ్మెల్యేకు క్యాంపు కార్యాలయాన్ని అందించడంలో తాత్సారం జరుగుతుండడంతో భవనానికి ఆర్డీవో కార్యాలయ అధికారులు తాళం వేసి వారి ఆధీనంలోకి తీసుకున్నారు. కానీ అప్పటికే సామగ్రి తరలిపోయింది. ఉన్న సామగ్రినైనా కాపాడుకోవాలని అధికారులు ఆలస్యంగా మేలుకుని తాళం వేశారు. ప్రభుత్వ సొమ్ముతో కొనుగోలు చేసిన వాటిని ఎత్తుకెళ్లడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్లంపల్లిలో...
బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బెల్లంపల్లి ఎమ్మెల్యే కూడా మారారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొద్దిరోజుల క్రితం ఖాళీ చేశారు. కానీ కార్యాలయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు ఏసీలు, ఫ్యాన్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. మిగతా సోఫాసెట్స్, డైనింగ్ సెట్, కుర్చీలు, బెడ్‌లు కానరావడంలేదు. కార్యాలయాన్ని ఖాళీ చేసే సమయంలో పట్టుకెళ్లారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెన్నూర్‌లో...
చెన్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఓడిపోయారు. దీంతో క్యాంపు కార్యాలయంలో తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సామగ్రిని ఇటీవల తీసుకెళ్లారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సామగ్రి చోరీకి గురైందని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సమకూర్చిన రెండు ఏసీలు, మూడు గీజర్లు, ఫ్యాన్లు, లైట్లు ఉన్నట్లు గుర్తించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నేటికీ క్యాంప్ కార్యాలయాన్ని స్వాధీనం చేసుకోలేదు. అధికారుల ఆధీనంలోనే ఉందని తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు.

కాగజ్‌నగర్‌లో...
కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కాపువాడలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని గురువారం 'సాక్షి' విజిట్ చేయగా ఫర్నిచర్, తలుపులు, కిటికీలతో పాటు ఇతర సామగ్రి సైతం ఉపయోగకరంగా ఉన్నాయి. బుధవారం కార్యాలయాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు అప్పగించినట్లు ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రమోద్ కుమార్ తెలిపారు.

బోథ్‌లో...
ఇచ్చోడ(బోథ్): బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఫర్నీచర్ నాలుగు నెలల ముందే మాయమైంది. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం టికెట్ నిరాకరించింది. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌కు టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ముందస్తుగానే ఆగస్టు 24న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోని ఫర్నీచర్, ఇతర విలువైన వస్తువులను అర్ధరాత్రి ఆదిలాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై అప్పట్లో ప్రతిపక్షనేతలు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌ను వివరణ కోరగా అప్పట్లో తాను లేనని, ఈ విషయం తనకు తెలియదన్నారు.

మాజీ కలెక్టర్లకు 'కరెంట్' పోస్టులు



కర్నాటి వరుణ్‌రెడ్డి



ముషారఫ్‌అలీ ఫారూఖీ

నిర్మల్: జిల్లా కలెక్టర్లుగా పనిచేసి వెళ్లిన ఇద్దరు యువ ఐఏఎస్‌లు ముషారఫ్‌అలీ, కర్నాటి వరుణ్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం కొత్త పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇద్దరినీ విద్యుత్ పంపిణీ వ్యవస్థలకు ఎండీలుగా నియమించింది. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎన్‌పీడీసీఎల్) ఎండీగా కర్నాటి వరుణ్‌రెడ్డి, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్‌పీడీసీఎల్) ఎండీగా ముషారఫ్‌అలీ నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వరుణ్‌రెడ్డి మళ్లీ ఇక్కడికే వస్తారన్న ఊహాగానాలు ఉన్నప్పటికీ ఆయనను ప్రభుత్వం ఎన్‌పీడీసీఎల్ ఎండీగా నియమించింది.

ఇష్టపడి చదివితే మంచి మార్కులు

మంచిర్యాలఅర్బన్: కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని డీఐఈవో శైలజ అన్నారు. గురువారం మంచిర్యాల కేజీబీవీని సందర్శించారు. ల్యాబ్‌తో పాటు తరగతి గదుల్లో బోధన పరిశీలించి బాలికలతో ముచ్చటించారు. విద్యార్థులు మంచిమార్కులు సాధించేందుకు సలహాలు, సూచనలు ఇచ్చారు. విద్యార్థుల హాజరు, ప్రగతిపై చర్చించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కస్తూరిబా బియ్యం పక్కదారి...



విచారణ చేపడుతున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

- లెక్కతప్పిన 2.5క్వింటాళ్ల బియ్యం

సిరికొండ: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలకు రావాల్సిన బియ్యం పక్కదారి పట్టాయి. ఇచ్చోడలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి గురువారం సిరికొండ కస్తూరిబాకు 21.94 క్వింటాళ్ల బియ్యం రావాలి. వాహనంలో బియ్యం తీసుకొస్తూ మార్గమధ్యలో వాహనదారుడు 50కిలోల బియ్యం వాహనం నుంచి తీస్తుండడగా స్థానికుల కంటపడ్డాడు. దీంతో అతడిని ప్రశ్నించి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అతడు బియ్యంతో ఉన్న వాహనాన్ని కస్తూరిబా పాఠశాలకు తరలించి అక్కడ లెక్కపెట్టడంతో 21.94 క్వింటాళ్లకు 44 బియ్యం సంచులు రావాలి. కానీ అందులో ఏకంగా 5సంచుల బియ్యం 2.50 క్వింటాళ్ల బియ్యం తక్కువచ్చాయి. దీంతో రెవెన్యూ అధికారులు పౌర సరఫరాల శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని విచారణ చేపట్టారు. ఇందులో రెవెన్యూ తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, పౌర సరఫరాల శాఖ డీటీ త్రయంబక్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, ఎస్‌వో సంధ్యారాణి ఉన్నారు.



21.94 క్వింటాళ్ల పత్రం

ఓ మహిళా.. జర పదిలం

- మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీ
- బస్టాండ్ ప్రాంతాల్లో దొంగలు చేతివాటం ప్రదర్శించే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు, ఆర్టీసీ అధికారులు



నిర్మల్ ప్రయాణప్రాంగణంలో మహిళల రద్దీ

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలోని ప్రధాన పట్టణాలైనా నిర్మల్, భైంసా, ఖానాపూర్ తదితర రూట్లతో పాటు ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య అధికంగా పెరిగింది. ప్రయాణ ప్రాంగణాల్లో పురుషుల కంటే మహిళ ప్రయాణికులే ఎక్కువగా ఉండడంతో దీనిని అదునుగా తీసుకున్న చిల్లర దొంగలు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని పోలీసులు, ఆర్టీసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. మహిళలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల వద్ద మహిళల రద్దీ..
ఆర్మూర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు మహిళా ప్రయాణికులు అధికంగా వస్తున్నారు. పల్లె వెలుగులతో పోల్చితే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. పల్లె వెలుగు బస్సులు ఎక్కువగా స్టాపులు ఉండడంతో ఎక్స్‌ప్రెస్ బస్సులకు ఎక్కడానికి మొగ్గు చూపుతున్నారు. తక్కువ దూరం ప్రయాణించేవారు మండల కేంద్రాలకు, పల్లెలకు ప్రయాణించేవారు మాత్రం పల్లె వెలుగు బస్సులు ఆశ్రయిస్తున్నారు. ఇక ప్రధాన పట్టణాలకు వెళ్లేవారు ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాంల వద్ద ఎక్కువ మంది కనిపిస్తున్నారు. నిజామాబాద్, హైదరాబాద్ రూట్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపిస్తుంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వద్ద మహిళా ప్రయాణికులు ఉండడంతో చిల్లర దొంగలు చేతివాటాన్ని ప్రదర్శించే అవకాశం ఉంది. ఇలాంటి దొంగతనాలు గతంలో నమోదైనట్లు పోలీసులు చెబుతున్నారు. ఇటువంటి రద్దీ సమయంలో ప్రయాణించే మహిళలు విలువైన నగలు ధరించకూడకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. తమ హ్యాండ్ బ్యాగులో సైతం విలువైన వస్తువులు, ఖరీదైన మొబైల్ ఫోన్ లను వెంట తీసుకెళ్లకపోవడమే ఉత్తమమని అంటున్నారు. అయితే ఆర్టీసీ అధికారులు సెక్యూరిటీ సిబ్బంది కూడా నిఘా పెంచడంతోపాటు ఎప్పటికప్పుడు మైకు ద్వారా అప్రమత్తం చేస్తున్నారు. దీనితోపాటు సీసీ కెమెరాలు నిఘా కూడా ఏర్పాటు చేశారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే...
ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో చోరీ ఘటనలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. పరిచయం లేని వ్యక్తులు అందించే వాటర్ బాటిల్ నీరు, తినుబండరాలు వంటివి వాటికి దూరంగా ఉండటమే మంచిదని అధికారులు హెచ్చరిస్తున్నారు. బస్టాండ్ ప్రాంతాల్లో బస్సు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే ఆర్టీసీ భద్రత సిబ్బందికి లేదా పోలీసులకు తెలియజేయాలని సూచిస్తున్నారు.

గతంలో కొన్ని ఘటనలు ఇలా...
గతంలో తరచుగా హ్యాండ్ బ్యాగులు, మొబైల్ ఫోన్లు, నగలు, డబ్బులు పోయినట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయి. కొందరు చిల్లర దొంగలు బస్టాండ్ ప్రాంతాల్లో చోరీలు చేయడమే పనిగా పెట్టుకొని మాకం వేస్తారు. అందులో కొన్ని ఘటనలు ఇలా..

- గత నెలలో బస్సు ఎక్కుతున్న మహిళ చేతిలోంచి మొబైల్ ఫోన్ లాక్కొని పరిగెడుతుండగా అక్కడే ఉన్న ఆర్టీసీ భద్రత సిబ్బంది ఆ దొంగను పట్టుకొని మొబైల్ ఫోన్ సంబంధిత మహిళకు ఇచ్చి దొంగను పోలీసులకు అప్పగించారు.
- పనిమీద జిల్లా కేంద్రానికి వచ్చినా ఓ వృద్ధురాలిని మాటల్లో పెట్టి ఆమె మెడలోని బంగారు నగలను గుర్తుతెలియని దొంగలు అపహరించారు. ఇలా పలు ఘటనలు చోటుచేసుకున్నాయి.

భద్రతాపరమైన చర్యలు చేపడుతున్నాం



మహాలక్ష్మి పథకం ద్వారా గతంలో కంటే ప్రస్తుతం మహిళల రద్దీ పెరిగిన మాట వాస్తవమే. రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. బస్టాండ్ సమీపంలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నాం. సీసీ కెమెరాలు, పోలీసుల సాకారం కూడా తీసుకుంటున్నాం. అదనపు సెక్యూరిటీని కూడా బస్టాండ్‌లో విధులు నిర్వహించేలా చూస్తున్నాం. మహిళా హోంగార్డులు, పోలీసుల సహాయం కూడా తీసుకుంటున్నాం. అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి.

– ప్రతిమారెడ్డి, ఆర్టీసీ డీఎం, నిర్మల్

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

- ప్రవాసిమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల



అవగాహన కల్పిస్తున్న యూనియన్ ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని ప్రవాసిమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో బీడబ్ల్యూఐ, సాస్క్ సంస్థల సహకారంతో జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎస్‌ఆర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ కార్యాలయంలో గల్ఫ్ దేశాలకు మొదటిసారి వెళ్తున్న వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ దుబాయ్, ఖతార్, మస్కట్, కువైట్, సౌదీ అరేబియా, బహెరిన్ వంటి దేశాలకు ఉపాధి కోసం వలస వెళ్తున్న దిగువ, మధ్యతరగతి కుటుంబాల కార్మికులు ఏజెంట్ల చేతుల్లో మోసపోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కంపెనీ వివరాలు పక్కాగా తెలుసుకున్న తర్వాతే వీసా కోసం డబ్బులు చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, తిరిగి ఇంటికి క్షేమంగా చేరుకునేలా వ్యవహరించాల్సిన తీరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సఖి కేంద్రం అధికారి మమత, యూనియన్ నాయకులు మురళి, విద్యాసాగర్, అజారుద్దీన్, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన బైక్ పట్టివేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో బోధన్‌లో చోరీకి గురైన వాహనం గురువారం పట్టుబడింది. పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ వివరాల ప్రకారం... బోధన్ పట్టణానికి చెందిన జహీద్‌ఖాన్‌కు చెందిన బైక్ గత నెలలో చోరీకి గురైంది. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ బైక్ నిర్మల్‌లో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడడంతో బోధన్ పోలీసుల నుంచి వివరాలు సేకరించి బాధితుడికి అప్పగించారు. ఇందులో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి విక్రయదారుడి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న పట్టణంలోని వరలక్ష్మినగర్‌కు చెందిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై హబీబ్‌ఖాన్ వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీలో భాగంగా గు రువారం శివాజీచౌక్‌లో బిస్మిల్లాఖాన్ ఆటోను తనిఖీ చేయగా 26ప్యాకెట్లలో 95గ్రాముల గంజాయి లభించింది. దానిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపాడు.

ఓసీలో స్థానికులకే ఉద్యోగం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న యువకులు

జైపూర్(చెన్నూర్): శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఓసీలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పలువురు యువకులు వోల్వోలను అడ్డుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు అరికె సంతోష్ మాట్లాడుతూ ఇటీవల కాంట్రాక్ట్ దక్కించుకున్న వరాహ కంపెనీ యాజమాన్యం స్థానికులను తొలగించి ఇతరులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని ఆరోపించారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఓసీ పీవో స్పందించి స్థానికులకు అవకాశం కల్పించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

లైంగికదాడి కేసు నమోదు

తానూరు: మండలంలోని బోల్సా గ్రామానికి చెందిన టెలర్ పోతన్న అనే వ్యక్తిపై గురువారం అత్యాచారయత్నం కేసు నమోదైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన వివాహిత బుధవారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వస్తోంది. గ్రామ సమీ పంలో పోతన్న ఆమెను బలవంతం చేయబోయాడు. ఆమె అరవడంతో స్థానికంగా ఉన్న వ్యవసాయదారులు అక్కడికి చేరుకోవడంతో పారిపోయాడు. గురువారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించాడు.

రైలు కింద పడి మహిళ ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని మసాల ఒర్రె వద్ద గురువారం పట్టాలపై నిలబడి ఉండడంతో కరీంనగర్–సిర్పూర్(టి) ప్యాసింజర్ రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. మృతురాలి వయస్సు దాదాపు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని, పంజాబీ డ్రెస్ ధరించి ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మతిస్థిమితం బాగాలేక రైలు వస్తుండగా ఎదురుగా పట్టాలపై నిలబడి ఉన్నట్లు రైలు డ్రైవర్ సమాచారం అందించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు వివరించారు.

సాయిబాబా ఆలయ ఆదాయం రూ.4లక్షలు

- సమావేశంలో వెల్లడించిన కమిటీ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివ సాయి సమాజ్ సాయిబాబా ఆలయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంకం రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 26వ వార్షికోత్సవానికి సంబంధించిన జమ, ఖర్చుల వివరాలను వెల్లడించారు. వార్షికోత్సవానికి నగదు రూపంలో రూ.20లక్షల 49వేల 543 వచ్చినప్పటికీ, ఖర్చు రూ.15 లక్షల 75వేల 518 అయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాలెన్స్ రూ.4లక్షల74వేల 25 ఉన్నట్లు వివరించారు. సమావేశంలో అర్చకులు శశిధర్, ఆలయ కమిటీ సభ్యులు కొక్కుల ప్రదీప్, తోట సత్యం, మడిగెల గంగాధర్, పిసుపాటి వెంకటప్పయ్య, కటకం శేఖరయ్య, గంటశాల గంగాధర్, నడిమెట్ల రమేష్, కరిపె శ్రీనివాస్, ద్యావత్ రాజేశ్వర్ ఉన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు పట్టించుకోని అధికారి

- ఆర్టీఐ కార్యకర్త నోముల రాజేందర్



హైకోర్టు కాపీని అందజేస్తున్న రాజేందర్

ఆసిఫాబాద్: తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను జిల్లా ఉపాధి కల్పనాధికారి పట్టించుకోవడంలేదని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న మందమర్రికి చెందిన ఆర్టీఐ కార్యకర్త నోముల రాజేందర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాలోని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అవినీతిపై సమాచారం కోసం ఆర్టీఐ కింద ఏప్రిల్ 10న దరఖాస్తు చేశానని, ఇందుకు సంబంధించిన కాపీలకు రూ.16 వేలు చెల్లించినప్పటికీ సమాచారం ఇవ్వక పోవడంతో హైకోర్టును ఆశ్రయించగా తనకు పూర్తి సమాచారం ఇవ్వాలని గత నెల 28న ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి వెళ్లి సమాచారం ఇవ్వాలని కోరినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై జిల్లా ఉపాధి కల్పనాధికారిపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తానన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు ఉత్తర్వు కాపీని కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బానుకు అందజేశారు.